
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 18 మే 2024



బైండోవర్ బెదిరింపులు

- కౌంటింగ్ ప్రక్రియకు విఘాతం కలిగించే కుట్ర
- టీడీపీ అభ్యర్థుల చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు, నాయకులకు ఫోన్లు
- స్టేషన్‌కు రావాలని, బైండోవర్ చేస్తామని హుకుం
- వైసీపీ నాయకులకు మాత్రం మినహాయింపు

విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 13వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్‌కు శుక్రవారం పటమట పోలీసుస్టేషన్ ఎస్సై ఫోన్ చేశారు. ఒకసారి స్టేషన్‌కు రావాలని ఆదేశించారు. ఎందుకు రావాలని ప్రసాద్ ప్రశ్నించారు. మిమ్మల్ని బైండోవర్ చేయమని ఉన్నతాధికారులు ఆదేశించారని సదరు ఎస్సై సమాధానమిచ్చారు. తనపై ఎలాంటి క్రిమినల్ కేసులు కానీ, క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ కానీ లేదని, తనను ఏవిధంగా బైండోవర్ చేస్తారని, తాను స్టేషన్‌కు రానని ప్రసాద్ సమాధానం చెప్పడంతో సదరు ఎస్సై ఫోన్ పెట్టేశారు. ప్రసాద్ విజయవాడ తూర్పు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్‌కు చీఫ్ ఎలక్షన్ ఏజెంట్. గద్దె రామ్మోహన్ తరఫున కౌంటింగ్ ప్రక్రియను ఆయన పర్యవేక్షించాల్సి ఉంది. అలాంటి వ్యక్తిని దాడులకు, ఘర్షణలకు ప్రేరేపిస్తారన్న అనుమానంతో బైండోవర్ చేయడం ఏమిటని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఒక్క ప్రసాదే కాదు.. జిల్లాలోని చాలామంది టీడీపీ నాయకులకు బైండోవర్ కాల్స్ చేసిన పోలీసులు.. వైసీపీ నాయకులకు మాత్రం మినహాయింపునిచ్చారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని టీడీపీ అభ్యర్థుల చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లందరికీ బైండోవర్ బెదిరింపులు వస్తున్నాయి. వీరితోపాటు కీలకమైన నాయకులకూ బెదిరింపులు వస్తుండటం గమనార్హం. నాల్గో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావుకు సైతం మాచవరం పోలీసులు ఫోన్ చేసి బైండోవర్ చేస్తామని చెప్పారు. కేవలం టీడీపీ తరఫున చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లుగా ఉన్నవారిని, కీలకమైన నాయకులను లక్ష్యంగా చేసుకుని పోలీసులు ఈ బైండోవర్ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. విజయవాడ సెంట్రల్‌లో పరుచూరి ప్రసాద్ వంటి నాయకులకు పోలీసుల నుంచి ఫోన్లు వచ్చాయి. గుడివాడ, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో సైతం పలువురు టీడీపీ నాయకులకు బైండోవర్ పిలుపులు వచ్చాయి. శని, ఆదివారాల్లో మరింత మందికి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. టీడీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్న పోలీసులు వైసీపీ నాయకుల ఊసే ఎత్తడం లేదు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే అధికారులపై ఎన్నికల సంఘం వేటు వేస్తున్నా రెండు జిల్లాల్లోని కొందరు పోలీసులు మాత్రం ఇంకా వైసీపీ వైపే మొగ్గి విధులు నిర్వహిస్తుండటం గమనార్హం.



బైండోవర్ అంటే..

పోలీసులు సీఆర్పీసీ 107 ప్రకారం బైండోవర్ చేస్తుంటారు. గతంలో ఏదైనా నేరచరిత్ర ఉన్నా, ఏదైనా గొడవల్లో ఉన్నా లేదా గొడవలకు కారణం అవుతారని భావించిన వారిని బైండోవర్ చేయడం సాధారణం. సీఆర్పీసీ 107 కింద బైండోవర్ పెట్టే అధికారం తహసీల్దారుకు మాత్రమే ఉంటుందని, పోలీసులకు ఆ అధికారం లేదని హైకోర్టు చెప్పినా పోలీసులు బైండోవర్ అస్త్రాన్ని యథేచ్ఛగా వాడేసుకుంటున్నారు. బైండోవర్ చేసిన వ్యక్తుల నుంచి రూ.లక్ష బాండ్ తీసుకుంటారు. ఏదైనా చిన్నపాటి గొడవలు జరిగినా, ఎటువంటి గొడవలకు పాల్పడినా ప్రభుత్వానికి ఆ రూ.లక్ష చెల్లించాలి. దీన్ని ఆధారంగా చేసుకుని ప్రతిపక్ష నాయకులను వేధింపులకు గురిచేయడం గత ఐదేళ్లలో సర్వసాధారణమైంది. కౌంటింగ్ ప్రక్రియకు సుమారు పక్షం రోజుల ముందు మళ్లీ ఈ బైండోవర్ అస్త్రాన్ని తెరపైకి తేవడం చర్చనీయాంశంగా మారింది.

వైసీపీ వారికి మినహాయింపు

- పెనమలూరు నియోజకవర్గంలో పోలింగ్ రోజు బట్ట అనిల్, కొత్తపల్లి రాజేశ్, నరగాని అశ్విన్ అనే రౌడీషీటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. కానీ, వీరికి మాత్రం బైండోవర్ లేదు.
- పోరంకి పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ రోజు జరిగిన ఘర్షణలో వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్, ఆయన కుమారుడు రాజీవ్ స్వయంగా పాల్గొన్నారు. వారిలో రాజీవ్‌పై కేసు పెట్టి, జోగి రమేశ్‌పై ఎలాంటి కేసు నమోదు చేయలేదు.
- పెనమలూరు నియోజకవర్గంలో పోలింగ్ ఏజెంట్లుగా ఉన్న టీడీపీ నాయకులకు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ దేవభక్తుని చక్రవర్తి వాట్సాప్ కాల్స్ చేసి బెదిరింపులకు దిగుతున్నారు. జూన్ 4 తర్వాత వారి అంతు చూస్తామని బెదిరిస్తున్నారు. ఈయనకు మాత్రం బైండోవర్ వర్తించదు.
- విజయవాడ పశ్చిమ నియోజకవర్గ 42వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ చైతన్యరెడ్డి భర్త ప్రసాద్‌రెడ్డి పోలింగ్ రోజున రెచ్చిపోయారు. పలువురిపై దాడులకు తెగబడ్డారు. ఆయన్ను గురువారం పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా, అక్కడి నుంచి పరారయ్యారు. బాధితులు ఈయనపై కేసులు పెట్టినా పోలీసులు స్పందించింది లేదు. ఇలాంటి వారికి బైండోవర్ వర్తించదా అని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు.
- గన్నవరంలో వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ అనుచరులు పోలింగ్ రోజు పెద్ద ఎత్తున అల్లర్లకు పాల్పడ్డారు. వారిలో ఒక్కరిపై కూడా బైండోవర్ పెట్టింది లేదు.
- విజయవాడ సెంట్రల్‌లో పోలింగ్ రోజున గొడవలకు దిగిన వెలంపల్లి శ్రీనివాసరావు అనుచరులు గంధసిరి బాలాజీ, ప్రకాశ్, ప్రభు విషయంలోనూ పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఎలాంటి నేరచరిత్ర లేని టీడీపీ నాయకులపై బైండోవర్ కేసులు పెడుతున్న పోలీసులు ఘర్షణలకు కారణమైన వైసీపీ నాయకుల విషయంలో మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

నాలుగు లైన్లుగా..

- విజయవాడ-దువ్వాడ, విజయవాడ-గూడూరు మధ్య 4 లైన్లు
- ఫైనల్ లొకేషన్ సర్వే జరుపుతున్న రైల్వే అధికారులు



విజయవాడ రైల్వే డివిజన్ మరింత విస్తరించనుంది. రానున్న రోజుల్లో గోల్డెన్ క్వాడ్రలైన్ కాబోతోంది. విజయవాడ డివిజన్‌లో అతిముఖ్యమైన విజయవాడ-గూడూరు, విజయవాడ-దువ్వాడ సెక్షన్ల మధ్య నాలుగులైన్ల (క్వాడ్రలైన్) ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని రైల్వే నిర్ణయించింది. యుద్ధప్రాతిపదికన రైల్వే ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్)ను చేపట్టింది.

విజయవాడ, మే 17 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని అన్ని రైల్వేజోన్ల కంటే రికార్డు స్థాయిలో విజయవాడ డివిజన్ ఆదాయం సాధిస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రవాణా కార్యకలాపాలను మరింత పెంచటం కోసం రైల్వేబోర్డు కూడా ఈ డివిజన్‌లో రైల్వేలైన్ల విషయంలో డబ్బు ఖర్చు పెట్టడానికి వెనుకాడటం లేదు. ఈ క్రమంలో గోల్డెన్ క్వాడ్రలైన్‌ను విస్తరించే దిశగా అడుగులు పడుతున్నాయి. విజయవాడ రైల్వే డివిజన్‌లో విజయవాడ-గూడూరు, విజయవాడ-దువ్వాడ సెక్షన్లు అతి ముఖ్యమైనవి. విజయవాడ నుంచి నెల్లూరు జిల్లా కనెక్టివిటీకి గూడూరు సెక్షన్, విజయవాడ నుంచి విశాఖపట్నం జిల్లా కనెక్టివిటీకి దువ్వాడ సెక్షన్లు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ మార్గంలో ఉన్నంత రద్దీ అంతా ఇంతా కాదు. ఈ గోల్డెన్ క్వాడ్రలైన్‌ను ఈ సెక్షన్ల నడుమే ఏర్పాటు చేయాలని చూస్తున్నారు.

శరవేగంగా..

సరుకు రవాణా రంగంలో విజయవాడ డివిజన్ సత్తా చాటుతోంది. మునుపెన్నడూ సాధించనంత రూ.5,600 కోట్ల పైబడి ఆదాయాన్ని 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించింది. దీనికి ప్రధాన కారణం పోర్టులు ఉండటమే. కాకినాడ పోర్టు, కృష్ణపట్నం పోర్టుల ద్వారా సింహభాగం ఆదాయాన్ని విజయవాడ రైల్వే డివిజన్ సాధించింది. ఈ రెండు సెక్షన్ల మధ్య కొత్తగా మరో నాలుగు పోర్టుల పనులు కూడా జరుగుతుండటంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పోర్టులకు కనెక్టివిటీ ఏర్పడితే రద్దీ లేకుండా చూసుకోవాల్సిన అంశాలపై రైల్వే ముందుచూపుతో క్వాడ్రలైన్‌పై దృష్టి సారించింది. అందుకే విజయవాడ-దువ్వాడ, విజయవాడ-గూడూరు సెక్షన్లను నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. రైల్వేబోర్డు నుంచి కూడా సానుకూల సంకేతాలు వచ్చినట్టుగా తెలుస్తోంది. విజయవాడ-గూడూరు సెక్షన్‌లో ప్రస్తుతం ట్రిప్లింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. గూడూరు నుంచి చుండూరు వరకు ట్రిప్లింగ్ పనులు పూర్తి కావటంతో పాటు ఫంక్షన్‌లోకి కూడా వచ్చింది. చుండూరు నుంచి కృష్ణా కెనాల్ జంక్షన్ వరకు 30 కిలోమీటర్ల మేర పనులు పురోగతిలో ఉన్నాయి. రానున్న అవసరాల దృష్ట్యా ఈ సెక్షన్‌లో నాల్గోలైన్ కూడా ఏర్పాటు చేయాలన్నది రైల్వే అధికారుల ఆలోచన. ఇక విజయవాడ-దువ్వాడ మధ్య ప్రస్తుతం డబ్లింగ్ మాత్రమే ఉంది. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రధానమైన సెక్షన్ ఇది. అత్యంత రద్దీగా ఉండే ఈ సెక్షన్‌లో మూడోలైన్ పనులు చేపట్టాలని ఎప్పటి నుంచో డిమాండ్ వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైల్వే అధికారులు మూడో లైన్‌తో పాటు నాలుగో లైన్ ఆలోచన చేయటం కూడా మంచి విషయం. లొకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్)ను ప్రస్తుతం రైల్వే చేపడుతోంది. రైల్వేబోర్డు ఆమోదంతో పనులకు శ్రీకారం చుట్టే అవకాశం కనిపిస్తోంది.



పడకేసిన పీడీఎస్

- మూడునెలలుగా గణనీయంగా తగ్గిన రేషన్ పంపిణీ శాతం
- మొన్నటి వరకు ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు బిజీ
- ఎన్నికల విధుల పేరుతో అక్రమార్కులకు అండదండలు
- ప్రజలకు చెందాల్సిన బియ్యం కాస్తా అక్రమార్కుల అడ్డాలోకి..
- ఎండీయూలు, డీలర్లపై సివిల్ సప్లయిస్ అధికారుల పర్యవేక్షణ నిల్

ఉమ్మడి కృష్ణాజిల్లాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ పడకేసింది. నిన్న మొన్నటి వరకు సివిల్ సప్లయిస్ అధికారులంతా ఎన్నికల విధుల్లో ఉన్నారు. దీంతో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల ఇష్టారాజ్యంగా మారిపోయింది. ఎన్నికల హడావిడి నెలకొన్న మూడు నెలలు పంపిణీ శాతం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. ఓవరాల్‌గా పంపిణీ శాతం తగ్గినా పట్టణ ప్రాంతాల్లో మాత్రం భారీగా పెరిగింది. ప్రాంతాల వారీగా పలు రేషన్ దుకాణాల్లో పంపిణీ సగం శాతం కూడా దాటలేదు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 957 రేషన్ దుకాణాలుండగా 5,97,815 మంది కార్డుదారులున్నారు. ఫిబ్రవరిలో 5,48,578 మంది కార్డుదారులు, మార్చిలో 5,46,062 మంది కార్డుదారులు, ఏప్రిల్‌లో 5,41,780 మంది, మేలో 16వ తేదీ వరకు 5,30,157 మంది కార్డుదారులకు మాత్రమే నిత్యావసరాలు పంపిణీ చేశారు. నెలనెలా చూసుకుంటే నిత్యావసరాలు తీసుకునే కార్డుదారుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. కృష్ణాజిల్లాలో మొత్తం 1059 రేషన్ డిపోలు ఉండగా 5,33,288 కార్డుదారులు ఉన్నారు. ఫిబ్రవరిలో 4,78,469 కార్డుదారులకు నిత్యావసరాలు పంపిణీ చేయగా.. మార్చిలో 4,75,518 మంది కార్డుదారులకు, ఏప్రిల్‌లో 4,70,032 మంది కార్డుదారులకు, మే నెల 16వ తేదీ వరకు 4,61200 కార్డుదారులకు మాత్రమే నిత్యావసరాల పంపిణీ జరిగింది.

మరికొందరికి పెరిగింది?

ఉమ్మడి జిల్లాలో నిత్యావసరాల పంపిణీ శాతం తగ్గుతోందని మనం చెప్పుకుంటున్నాం. ఇదే సందర్భంలో కొందరికి మాత్రం పెరుగుతోంది. ఉదాహరణకు మే నెల పంపిణీ సరళిని పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో 16వ తేదీ వచ్చినా 70 శాతం పంపిణీ కూడా పూర్తి కాని రేషన్ దుకాణాలు దాదాపు 200 వరకు ఉన్నాయి. పంపిణీ శాతం ఎక్కువగా నమోదైన వాటిని పరిశీలిస్తే.. ఎండీయూ ఆపరేటర్లలో చాలా మంది ఎక్కువగా బియ్యం అమ్ముకునే కార్డుదారులను గుర్తించి ముందు వారి ఏరియాల్లోనే పంపిణీ చేస్తున్నారు. దీంతో పంపిణీ శాతం పెరుగుతోంది. పంపిణీ శాతం పెరిగినా ఆ బియ్యం ప్రజల చేతిలో కాకుండా ఎండీయూ ఆపరేటర్ల చేతుల్లోనే ఉంటోంది.

అధికారుల అవినీతితో పంపిణీ అస్తవ్యస్తం

రెండు జిల్లాల్లో నిత్యావసరాల పంపిణీ శాతం తగ్గటంపై కారణాలు ఏమిటో పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎన్నికల డ్యూటీ పేరుతో ఉదాసీనంగా వ్యవహరించారు. సివిల్ సప్లయిస్ అధికారుల ఉదాసీనత కారణంగా కార్డుదారుల నుంచి అక్రమార్కులు బియ్యం కొనుగోలు చేయడానికి అవకాశం చిక్కింది. ప్రధానంగా సివిల్ సప్లయిస్‌లో మండల స్థాయి అధికారులు.. బియ్యం అక్రమ వ్యాపారం చేసే ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు, బియ్యం వ్యాపారులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లాస్థాయి అధికారులు తనిఖీలకు వస్తున్న విషయాన్ని ముందుగానే వారికి సమాచారం ఇవ్వటం ద్వారా అక్రమార్కులకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కార్డుదారుల నుంచి ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు కలిసి అక్రమంగా కొనుగోలు చేశారు.

ఆ బియ్యం ఏమౌతోంది?

ఎండీయూ ఆపరేటర్ల విధానం రాక ముందు ప్రతి రేషన్ దుకాణం పరిధిలో నెలలో 90 శాతంపైగా కార్డుదారులు రేషన్ తీసుకునే వారు. ఎండీయూ విధానంలో రేషన్ తీసుకునే వారి సంఖ్య సగానికి పడిపోయింది. చాలాచోట్ల పంపిణీ 70 శాతం దాటడం లేదు. స్థానిక అధికారులు కూడా అక్రమార్కులతో కలిసి వ్యాపారంలో వాటాలు తీసుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లతో పాటు రెండు జిల్లాల్లోని మున్సిపాలిటీల ఏరియాల్లో ఈ దందాను కొందరు అధికారులే తెర వెనుక ఉండి నడిపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

- వేసవిలో తాగునీటి ఎద్దడి తీవ్రం
- అధ్వాన రోడ్లతో జనం సతమతం
- ఖరీఫ్ సన్నద్ధతకు ప్రణాళిక ముఖ్యం
- సమస్యలపై నేడు జడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చ జరిగేనా?



ఎక్కడి సమస్యలు అక్కడే!

జిల్లాలో ప్రజా సమస్యలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. వేసవిలో తాగునీటి కోసం జనం పడరాని పాట్లు పడుతున్నారు. గుంతల రోడ్లతో రానున్న వర్షాకాలం ఎన్ని అగచాట్లు పడాల్సి వస్తుందోనని మదనపడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాల పంపిణీ, కృష్ణాడెల్టాకు సాగునీటి విడుదల తేదీ, తదితర అంశాలపై శనివారం జరగనున్న జడ్పీ సమావేశంలో ఎంతవరకు చర్చ జరుగుతుందోననే సందేహం నెలకొంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జెడ్పీ సమావేశపుహాలులో నేడు జరగనుంది. జిల్లాకు చెందిన శాసనసభ్యులు, ఎంపీలకు ఆఖరు సమావేశం కానుంది. సార్వత్రిక ఎన్నికలు ముగిసినా, కౌంటింగ్ జరగాల్సి ఉంది. గతంలో జరిగిన జెడ్పీ సమావేశానికి శాసనసభ్యులు, ఎంపీలు హాజరుకాలేదు. వారికి ఇదే ఆఖరు సమావేశం కావడంతో వారు హాజరవుతారా? లేదా? అనేది చూడాలి. ఎజెండా లేకుండానే ఈ సమావేశం జరుగుతోంది. ఎన్నికలకోడ్ అమలులో ఉండటంతో సభ్యులు అడిగిన ప్రశ్నలు, సమస్యలపై అధికారులు సమాధానం చెప్పడం తప్ప తగు నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం లేని స్థితి నెలకొంది. ఇక్కడ చర్చించిన కీలక అంశాలపై నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత సముచిత నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందనే ఆశ ఉంది.

ఖరీఫ్ సాగు ప్రణాళిక ముఖ్యం..

జూన్ నెల నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. ఎన్నికలకోడ్ అమలులో ఉండటంతో ఖరీఫ్ ప్రణాళికకు ఇంతవరకు ఆమోదం లభించలేదు. ఏపీ సీడ్స్ నుంచి ఎంతమేర విత్తనాలు కొనుగోలు చేయాలి? ఏ రకం వరి వంగడాలు వచ్చే సీజన్‌లో సాగుచేయాలి? ఎరువులు ఎంతమేర అందుబాటులో ఉంచాలి? అనే అంశంపై జెడ్పీ సమావేశంలో చర్చిస్తే సీజన్ ప్రారంభం నాటికైనా రైతులకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇదే విషయాన్ని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 3.20 లక్షలహెక్టార్లలో వివిధ పంటలసాగు జరిగింది. రెండో పంటగా మినుమును సాగు చేయడంతో ఏప్రిల్ నెలలోనూ రైతులు కుప్పనూర్పిళ్లు చేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను మార్చి నెలాఖరు నాటికి నిలిపివేయడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు వారు నిర్ణయించిన ధరకే విక్రయించుకోవాల్సి వచ్చింది. ధాన్యం కొనుగోలుకు మలివిడత అవకాశం ఇస్తామని చెప్పినా అనుమతులు ఇవ్వలేదు.



పొంచి ఉన్న తాగునీటి ఎద్దడి

ప్రస్తుత వేసవిలో సముద్రతీర ప్రాంతంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఏప్రిల్ నెల మొదటివారంలో తాగునీటి అవసరాల కోసం కాలువలకు నీటిని విడుదల చేశారు. తాగునీటి చెరువులను కొంతమేర నీటితో నింపారు. మరోరెండు నెలలకు గానీ కాలువలకు నీటిని విడుదల చేసేందుకు అవకాశం ఉంది. కాలువలకు నీటిని విడుదల చేస్తేనే తాగునీటి చెరువులలో నీటిని నింపేందుకు అవకాశం ఉంటుంది. జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకోసం తీసుకోవాల్సిన చర్యల అంశాన్ని అత్యవసరంగా తీసుకుని అధికారులు సముచిత నిర్ణయం జెడ్పీ సమావేశంలో తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. తీరంవెంబడి ఉన్న మచిలీపట్నం, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, నాగాయలంక, కోడూరు తదితర మండలాల్లో ఈ నెలాఖరునాటికి తాగునీటి ఎద్దడి ఏర్పడటం ఖాయంగా కనిపిస్తోంది. రెండునెలల పాటు తాగునీటి ఎద్దడి నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు నిధుల విడుదల అంశంపై చర్చించేందుకు సభ్యులు సిద్ధమవుతున్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులేవి?

ఉమ్మడి జిల్లాలో 1400కు పైగా జగనన్న లేఅవుట్‌లు ఉన్నాయి. కొన్ని కాలనీల్లో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకొనున్నారు. కానీ ఈ కాలనీల్లో రహదారులను పూర్తిస్థాయిలో నిర్మాణం చేయలేదు. విద్యుత్ స్తంభాలు వేసినా విద్యుత్ కనెక్షన్లు ఇంకా ఇవ్వలేదు. గతంలో అనుమతులు ఇచ్చిన పనులే కావడంతో ఈ పనులు ఎంతమేర చేస్తారనే అంశంపైనా సభ్యులు ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో రెండేళ్ల క్రితం మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో (10+2) ఈ ఏడాది ఉత్తీర్ణతాశాతం దారుణంగా ఉంది. ఈ అంశంపైనా చర్చిస్తామని సభ్యులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ తరుముకొస్తోంది. ప్రధాన కాలువలు, డ్రెయిన్‌లలో పనులు చేసేందుకు నీటిపారుదలశాఖ అధికారులు అంచనాలు తయారుచేసి పంపినా ఆమోదం ఎప్పటికి లభిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ పనులను అత్యవసరంగా భావించి అనుమతులు ఇచ్చే అంశంపై చర్చకు పట్టుబడతామని సభ్యులు చెబుతున్నారు.

పీహెచ్ఎస్‌సీలోకి వెళ్లాలంటే.. గర్భిణులు, బాలింతలకు ప్రయాసే!

- తొట్లవల్లూరు నార్త్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం (పీహెచ్ఎస్‌సీ)లో పగుళ్లిచ్చిన మెట్లు, అరుగు
- లోపల చెదలు పట్టిన ఫ్లోరింగ్
- పగుళ్లిచ్చిన మెట్లపై నుంచి లోపలికి వెళ్లేందుకు గర్భిణులు, బాలింతల అవస్థలు

- 6లో..

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయండి

అధికారులకు కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం



కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, మే 17 (ఆంధ్ర జ్యోతి): కృష్ణా యూనివర్సిటీలో జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపునకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని అధికారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపు హాలులో శుక్రవారం రిటర్నింగ్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్, మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, మెటీరియల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులు, ఎన్ఐసీ, ఎన్‌కోర్ టీమ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు కోసం నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు తగినన్ని టేబుల్స్‌ను ఏర్పాటు చేసి, అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలన్నారు. కౌంటింగ్ విధులకు హాజరయ్యే ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుకోసం ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల పక్కనే ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్‌కు వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు కంప్యూటర్లు, ప్రింటర్లు ఏర్పాటు చేయాలన్నారు. రౌండ్ల వారీగా ఎన్నికల ఫలితాలు తెలియజేసేందుకు కమ్యూనికేషన్ రూమ్, మీడియా రూమ్, డిస్‌ప్లే రూమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద బారికేడింగ్ పనులు చేపట్టాలని, సిబ్బంది, ఆయా పార్టీల కౌంటింగ్ ఏజెంట్లు హాలులోకి ప్రవేశించేందుకు సూచికలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈనెల 26వతేదీ నాటికి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపు హాలులో కౌంటింగ్ కేంద్రం నమూనాను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు సమావేశంలో పాల్గొన్నారు.

జిల్లాలో శాంతిభద్రతలపై దృష్టి సారించండి

రెవెన్యూ, పోలీసు అధికారులతో కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, మే 17(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలో శాంతిభద్రతలపై దృష్టి సారించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి జిల్లాలోని పోలీస్, రెవెన్యూ అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ అనంతరం నుంచి కౌంటింగ్ పూర్తయ్యేవరకు జిల్లాలో అన్ని ప్రాంతాల్లో అధికారులు నిఘా ఉంచాలన్నారు. ఎక్కడైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉంటే ముందుగానే సమాచారం ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో వీఆర్ఏలు, వీఆర్వోలు, తహసీల్దార్లు, పోలీసులు సమన్వయంతో పనిచేసి ఆయా ప్రాంతాల్లో పరిస్థితులపై తనకు రోజువారీ నివేదిక పంపాలన్నారు. చెక్‌పోస్టులవద్ద నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో కె. చంద్రశేఖరరావు, ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు, ఆర్వోలు, డీఎస్పీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

25 నుంచి 30 వరకు
హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక శిబిరం

మచిలీపట్నం, మే 17(ఆంధ్రజ్యోతి): గన్నవరం విమానాశ్రయం వద్ద ఉన్న కేసరపల్లిలోని ఈద్గా జమామసీదు వద్ద హజ్ యాత్రికుల కోసం ఈనెల 25వతేదీ నుంచి 30వతేదీ వరకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శిబిరం నిర్వహణ, ఏర్పాట్లపై గూగుల్‌మీట్ ద్వారా శుక్రవారం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. శిబిరం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని, పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. శిబిరం వద్ద సీసీ కెమెరాలను అమర్చాలని సూచించారు. హజ్ కమిటీ ప్రతినిధి అబ్దుల్ ఖాదర్, ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు, గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి, డీపీవో నాగేశ్వరనాయక్, డీఎంహెచ్‌వో గీతాబాయి పాల్గొన్నారు.

కృష్ణా జిల్లాలో 18.9 మిల్లీమీటర్ల వర్షపాతం

21వరకు కోస్తాతీరం వెంబడి వర్షాలు

మచిలీపట్నం, మే17(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం ఆరు గంటల నుంచి 7గంటల వరకు భారీ వర్షం కురిసింది. అవనిగడ్డలో అత్యధికంగా 49.8మిల్లీమీటర్లు, అత్యల్పంగా గన్నవరంలో 4.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 18.9మిల్లీమీటర్లుగా నమోదైంది. ఈనెల 21వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని వాతవరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. వేసవిలో వర్షాలు కురుస్తుండటంతో జిల్లా ప్రజలు కొంతమేర ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు

పెడనలో 42.2 మిల్లీమీటర్లు, చల్లపల్లిలో 39.8, ఘంటసాలలో 31.6, మచిలీపట్నంలో 31.2, నాగాయలంకలో 28.2, బంటుమిల్లిలో 27.4, పామర్రులో 21.4, పమిడిముక్కలలో 19.4, ఉంగుటూరులో19.4, గుడ్లవల్లేరులో 19.2, కృత్తివెన్నులో18.2, మోపిదేవిలో 18.2, కోడూరులో 17.6, నందివాడలో 12.4, తోట్లవల్లూరులో 12.4, గుడివాడలో10.4, పెదపారుపూడిలో 9.2, గూడూరులో 8.6, పెనమలూరులో 7.8, కంకిపాడులో 6.2, మొవ్వలో 5.6, ఉయ్యూరులో 5.4, బాపులపాడులో 5.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వైద్యసేవల కోసం తోట్లవల్లూరు నార్తు దళితవాడలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం (పీహెచ్ఎస్‌సీ)లోనికి వెళ్లడం గర్భిణులు, బాలింతలకు ప్రయాసగా మారింది. ఆరోగ్య ఉప కేంద్రం లోపలికి వెళ్లే మెట్లు కుంగిపోయి పెద్దపెద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. పగుళ్లలో విష సర్పాలు చేరుతున్నాయి. దీంతో వైద్య సిబ్బంది కూడా ఇక్కడకు రావాలంటే భయపడుతున్నారు.



తోట్లవల్లూరు దళితవాడలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం

పీహెచ్‌ఎస్‌సీలోకి వెళ్లాలంటే..
గర్భిణులు, బాలింతలకు ప్రయాసే!

- తోట్లవల్లూరు నార్త్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం (పీహెచ్‌ఎస్‌సీ)లో పగుళ్లిచ్చిన మెట్లు, అరుగు
- లోపల చెదలు పట్టిన ఫ్లోరింగ్
- పగుళ్లిచ్చిన మెట్లపై నుంచి లోపలికి వెళ్లేందుకు గర్భిణులు, బాలింతల అవస్థలు

తోట్లవల్లూరు: జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ నిధులు రూ.14 లక్షలతో 2017లో తోట్లవల్లూరు నార్తు దళితవాడలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని నిర్మించారు. నిర్మించిన కొద్ది నెలలకే లోపలికి వెళ్లేందుకు నిర్మించిన మెట్ల మార్గం కుంగిపోయి పగుళ్లు ఏర్పడ్డాయి. లోపల కూడా ఫ్లోరింగ్ పాడై చెదలు పడుతోంది. లోపలికి వచ్చేందుకు నిర్మించిన మెట్లు పగుళ్లిచ్చాయి. దీంతో నడిచేందుకు ఉపయోగపడుతున్న అరుగు కూడా కుంగిపోయి పగుళ్లిచ్చింది. ఈ భవనం నిర్మించిన తర్వాత కాంట్రాక్టరుతో మెయింటినెన్స్ వర్క్స్(మరమ్మతులు) చేయించటంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వచ్చాయి. మాగాణి పొలాల పక్కనే ఉండటంతో విష సర్పాలు సంచరిస్తున్నాయని, మెట్ల పగుళ్లలో పాములు చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రతి నెలా 2వ, 4వ శనివారం పరీక్షలు చేయించుకోవడానికి గర్భిణులు, ప్రతినెలా 3వ శనివారం వ్యాధినిరోధక టీకాలు వేయించేందుకు పిల్లలను తీసుకుని తల్లులు, ఇతరులు వైద్య సేవల కోసం ఈ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి వస్తారు. నిండు గర్భిణులు, పసిపిల్లలను ఎత్తుకుని బాలింతలు ఆరోగ్య ఉప కేంద్రానికి వచ్చి లోపలికి వెళ్లాలంటే మార్గం సరిగ్గా లేక ఎంతో ప్రయాసపడుతున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. నాడు-నేడు కార్యక్రమంలోనూ అధికారులు ఈ ఆరోగ్య ఉప కేంద్రాన్ని బాగు చేయించలేకపోయారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి స్పందన శూన్యం

మరమ్మతుల కోసం గతంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు లేఖ రాశాం. ఎలాంటి స్పందన లేదు. మెట్లు పగిలిపోయాయి. లోపల చెదల పుట్టలున్నాయి. పాములు వస్తున్నాయి. అందరూ ఇబ్బంది పడుతున్నారు. మరోసారి డీఎం అండ్ హెచ్‌వోకు లేఖ రాస్తాం.

- డాక్టర్ సాయిప్రసన్న, తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి



పగుళ్లు ఏర్పడడంతో గర్భిణులు లోపలికి వెళ్లేందుకు అనుకూలంగా లేని మెట్లు



మెట్లు పగిలిపోవడంతో కుంగిన అరుగుపైనే నడుస్తున్న బాలింత

కాలికి ఆపరేషన్ చేయించుకున్న యువతి మృతి

- శస్త్రచికిత్స వికటించి చనిపోయిందని తండ్రి ఆరోపణ
- ఎంజే నాయుడు ఆస్పత్రిని సీజ్ చేయాలని డిమాండ్
- ఆస్పత్రి ఎదుట కుటుంబసభ్యులు, బంధువుల ఆందోళన
- పోలీసుల రంగప్రవేశం..న్యాయం చేయిస్తామని హామీ
- ఆందోళన విరమించిన యువతి కుటుంబసభ్యులు





ఎంజే నాయుడు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న యువతి కుటుంబసభ్యులు, ఇన్‌సెట్‌లో మృతి చెందిన బీటెక్ విద్యార్థిని లిఖిత(ఫైల్)

వన్‌టౌన్, మే 17: ఐదేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో కాలికి ఫ్యాక్చరవడంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి వేసిన ప్లేట్లను తీయించుకోవడానికి ఎంజే నాయుడు ఆస్పత్రికి వచ్చిన యువతి చికిత్స పొందుతూ మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యం వలనే యువతి ప్రాణాలు కోల్పోయిందని ఆమె తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆపరేషన్ వికటించి యువతి మృతిచెందిందని వైద్యులు అసలు విషయం చెప్పకుండా దాటవేసి తమను మభ్యపెట్టారని ఆస్పత్రిని సీజ్ చేయాలని ఆమె తండ్రి డిమాండ్ చేశారు. ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు బైఠాయించారు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. గాంధీనగర్ ఐనాక్స్ థియేటర్ ఎదురుగా నివసిస్తున్న వస్త్ర వ్యాపారి రమేష్ కుమార్తె లిఖిత(18) మిక్‌లో బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. ఐదేళ్ల క్రితం ఆమె కాలికి ఫ్యాక్చర్ కావడంతో శస్త్రచికిత్స చేసి ప్లేట్లు వేశారు. ఆ ప్లేట్లను తీయించుకోవాలని ఈనెల 15న ఉదయం 11 గంటలకు సూర్యారావుపేటలోని ఎంజే నాయుడు ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రి వైద్యులు పరీక్షించి ఆమెకు ఆపరేషన్ థియేటర్‌లో శస్త్రచికిత్స చేశారు. తర్వాత లిఖితకు సీరియస్‌గా ఉందని చెప్పారు. శుక్రవారం ఉదయం లిఖిత మృతిచెందింది. లంగ్స్‌లోకి నీరు వెళ్లిందని, ఫిట్స్ వచ్చాయని వెంటిలేటర్‌లో ఉంచామని, ఇంట్లో ఎవరికైనా ఫిట్స్ ఉన్నాయా అంటూ తల్లిదండ్రులకు వైద్యులు ఆలస్యంగా చెప్పడంతో కుటుంబసభ్యుల ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. ఆస్పత్రి వైద్యులు తమను మభ్యపెట్టారని విషయం చెప్పకుండా దాటవేశారని, ఆపరేషన్ వికటించి లిఖిత మృతిచెందిందని ఆమె తండ్రి రమేశ్ ఆరోపించారు. ఆస్పత్రి ఎదుట యువతి కుటుంబ సభ్యులు, బంధువులు బైఠాయించారని సమాచారం తెలుసుకున్న సౌత్ ఏసీపీ జి.రత్నంరాజు ఆధ్వర్యంలో సూర్యారావుపేట, గవర్నరుపేట, కృష్ణలంక సీఐలు దుర్గారావు, రమణ, మురళీకృష్ణ, టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్‌లు సిబ్బందితో వెళ్లి వైద్యులు, యువతి తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపారు. న్యాయం చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది. అనంతరం లిఖిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

కొనకళ్లకు పరామర్శ



మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను పరామర్శిస్తున్న గద్దె రామ్మోహన్, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా



కొనకళ్లతో మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు, దేవినేని ఉమా

విద్యాధరపురం, మే 17: ఇటీవల గుండెపోటు రావడంతో స్టంట్స్ వేయించుకుని విజయవాడ రమేశ్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావును శుక్రవారం పలువురు నాయకులు పరామర్శించారు. టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్నె వెంకట నారాయణప్రసాద్(అన్న), టీడీపీ గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బీసీ, మైనార్టీ నాయకుడు నాగుల్‌మీరా తదితరులు వేర్వేరుగా పరామర్శించారు. నారాయణరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

దూండీ రాకేశ్ గృహ నిర్బంధం

పల్నాడులో కిరాణా వ్యాపారులను పరామర్శించడానికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు



వన్‌టౌన్, మే 17: కేదారేశ్వరపేట లోటస్‌లో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దూండీ రాకేశ్‌ను శుక్రవారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. టీడీపీకి ఓటు వేయొద్దంటూ పల్నాడు జిల్లా ఉంగుటూరు గ్రామంలో కిరణా వ్యాపారులను వైసీపీ నాయకులు బెదిరించినా వ్యాపారులు టీడీపీకి ఓటు వేశారు. కాదన్నా ఓటేశారన్న అక్కసుతో షాపులు తెరిస్తే అంతుచూస్తామని వైసీపీ నాయకులు బెదిరించి వ్యాపారులను ఇబ్బంది పెడుతుండడంతో వారిని పరామర్శించడానికి దూండీ రాకేశ్ బయలుదేరారు. అమరావతి నుంచి వచ్చిన పోలీసులు, స్థానిక పోలీసులు ఆయనను గృహనిర్బంధం చేశారు.

కేయూ డిగ్రీ ఆరో సెమిస్టర్
పరీక్షా ఫలితాల విడుదల

98.41 శాతం ఉత్తీర్ణత

మచిలీపట్నం టౌన్, మే 17: కృష్ణా విశ్వవిద్యాలయం డిగ్రీ ఆరో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి శుక్రవారం వెల్లడించారు. 8,827 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 8,687 మంది ఉత్తీర్ణులై 98.41 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 1,250 మంది సప్లిమెంటరీ పరీక్షలు రాయగా 51.13 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈనెల 11న పరీక్షలు పూర్తి కాగా ఐదు రోజుల్లోనే ఫలితాలు వెల్లడించామన్నారు. పునఃమూల్యాంకనం కోసం ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వీసీ సూచించారు. రిజిస్ట్రార్ శోభన్‌బాబు, ఫైనాన్స్ అధికారి రతన్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రధానాచార్యుడు సుందరకృష్ణ, డీన్ రామశేఖరరెడ్డి పాల్గొన్నారు.

డీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలకు
25లోగా ఫీజు చెల్లించాలి

మచిలీపట్నం టౌన్, మే 17: డీఈడీ విద్యార్థులు నాలుగో సెమిస్టర్ పరీక్షలకు ఈనెల 25లోగా రూ.50 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించాలని డీఈవో తాహెరా సుల్తానా ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణులు కాని విద్యార్థులు 4 నుంచి 6 సబ్జెక్టులకు రూ.250, 3 సబ్జెక్టులకు రూ.175, 2 సబ్జెక్టులకు రూ.150, ఒక సబ్జెక్టుకు రూ.125 చెల్లించాలని ఆమె సూచించారు.

రైలు ప్రమాదంలో
గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుడివాడ: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండవల్లి మండలం పసలపూడి రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. రైల్వే ఎస్సై బి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... "35 నుంచి 40 ఏళ్ల వయస్సుగల వ్యక్తిని రైలుబండి ఢీకొనడంతో మృతి చెందినట్టు గుర్తించాం. మృతుడి దేహంపై బ్లూ కలర్ జీన్స్‌ప్యాంట్, బ్లూ కలర్ చొక్కా ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 94406 27570కు సమాచారం అందించాలి." అని ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు.

హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ
కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు

కృష్ణలంక, మే 17: తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ టెక్నాలజీలో డిప్లమో ఇన్ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కృష్ణాజిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి కె.అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 23 ఏళ్ల వయస్సు, పదో తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఇంటర్ ఎంపీసీ గ్రూపులో ఉత్తీర్ణులు, పదో తరగతితో పాటు ఐటీఐ రెండేళ్లు ఉత్తీర్ణులైన వారికి నేరుగా సెకండ్ ఇయర్ డిప్లమో కోర్సులో ప్రవేశం ఉంటుందని తెలిపారు. షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన విద్యార్థులకు గరిష్ట వయో పరిమితి 25 ఏళ్లు అని తెలిపారు. డిప్లమో మొదటి సంవత్సరంలో నెలకు రూ.వెయ్యి, రెండో ఏడాదిలో నెలకు రూ.1100, మూడో ఏడాది నెలకు రూ.1200 స్టైఫండ్ ఇస్తారని తెలిపారు. వెంకటగిరిలో 53 సీట్లకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 93999 36872, 98661 69908లో సంప్రదించాలని ఆయన సూచించారు. జూన్ 1వ తేదీతో దరఖాస్తులకు గడువు ముగుస్తుందని, దరఖాస్తులను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఐహెచ్‌టీవీజీఆర్.కామ్ ద్వారా పొందవచ్చని తెలిపారు.

కాన్పూరు, బెంగళూరులో
అగ్ని వీర్వాయు ర్యాలీ

విజయవాడ, మే 17: బెంగళూరు, కాన్పూరులో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్ని వీర్వాయు(సంగీతకారుడు) నియామక ర్యాలీ నిర్వహిస్తున్నట్టు భాషా సాంస్కృతిక శాఖ తెలిపింది. 2004 జనవరి 2 - 2007 జూలై 2వ తేదీ మధ్య జన్మించిన అవివాహిత పురుషులు, స్త్రీలు పదో తరగతి ఉత్తీర్ణులై, సంగీతంలో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిప్లమో లేదా తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలని స్పష్టం చేసింది. అభ్యర్థులు అగ్నిపథ్‌వాయు.సీడీఏసీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

ఎన్నికల్లో జోగి రమేశ్ అక్రమాలు కోకొల్లలు

- రౌడీషీటర్లను తీసుకొచ్చి ఓటర్లను భయపెట్టారు
- టీడీపీ కార్యకర్తలు సంయమనం పాటించారు
- లేకుంటే జోగీ పోరంకి దాటేవాడేవా?: బోడె ప్రసాద్

విద్యాధరపురం, మే 17: "ఎన్నికల్లో వైసీపీ పెనమలూరు అభ్యర్థి జోగి రమేశ్ ఎన్నో అక్రమాలకు పాల్పడ్డాడు. రెవెన్యూ అధికారులను, ఉయ్యూరు సీఐ, కంకిపాడు, పెనమలూరు స్టేషన్లకు ఎస్సైలను, పెడన నుంచి కొంతమందిని ఇక్కడకు బదిలీ చేయించుకున్నాడు. మైలవరం, పెడన, పటమటల నుంచి రౌడీ షీటర్లను తీసుకొచ్చాడు. రౌడీషీటర్లు బట్ట అనిల్, కొత్తపల్లి రాజేష్, మరగాని అశ్విన్‌లు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. జోగి రమేశ్ ఆగడాలను అరికట్టడంలో పెనమలూరు సీఐ విఫలమయ్యాడు. పెనమలూరు సీఐపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తాం." అని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇబ్రహీంపట్నంలో నివాసముంటున్న జోగి రమేశ్‌కు, అతని కుటుంబసభ్యులకు పెనమలూరులో ఓటు ఎలా వచ్చిందో చెప్పాలన్నారు. టీడీపీకి కంచుకోట అయిన పోరంకిలో గంట పాటు పోలింగ్‌ను నిలిపివేసి భయాందోళనకు గురి చేశారన్నారు. 200 మీటర్ల దూరంలో ఉండాల్సిన వారు బూత్ ముందే హల్‌చల్ చేస్తే పోలీసులు దృష్టికి తెచ్చినా వారు పట్టించుకోలేదన్నారు. తనమీద మూడు కేసులు పెట్టారని జోగి రమేశ్ అల్లర్లు చేస్తే అతనిపై ఒక్క కేసు కూడా నమోదు చేయలేదన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత వలసపక్షి జోగి రమేశ్ అడ్రస్ కనిపించదన్నారు. టీడీపీ కార్యకర్తలపై దాడులకు దిగిన వారిని వదిలిపెట్టబోమని వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. పోరంకిని స్వాధీనపరుచుకున్నట్లుగా జోగి రమేశ్ వీర్రవీగుతున్నాడని అతనేమైనా రాజానా? అని ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తలు సంయమనం పాటించడంతోనే జోగి రమేశ్ పోరంకి దాటి వెళ్లాడన్నారు. కానూరుకు చెందిన కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ దేవభక్తుని చక్రవర్తి టీడీపీ కార్యకర్తలకు వాట్సాప్ కాల్ చేసి బెదిరిస్తున్నారన్నారు. కులాల పేరుతో నియోజకవర్గంలో అల్లర్లు సృష్టిస్తున్నారన్నారు. కానూరు కెనడీ స్కూల్‌లో క్యూలో ఉన్న మహిళల పట్ల వైసీపీ నాయకుడు పడవల కృష్ణమూర్తి అసభ్యకరంగా ప్రవర్తించాడన్నారు. పోలింగ్ ముగిశాక ఎస్పీ వచ్చి అంతా ప్రశాంతంగా ఉన్నట్లు ప్రకటించారన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు

బోడె ప్రసాద్, దేవభక్తుని చక్రవర్తికి పోలీసుల నోటీసులు

పెనమలూరు: వైరి వర్గాలను రెచ్చగొట్టేలా విలేకరుల సమావేశాల్లో వ్యాఖ్యలు చేశారంటూ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్‌కు, కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ దేవభక్తుని చక్రవర్తికి పెనమలూరు పోలీసులు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం ఆటోనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో బోడె ప్రసాద్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తే, దానికి ప్రతిగా గంగూరు వైసీపీ కార్యాలయంలో సాయంత్రం దేవభక్తుని చక్రవర్తి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశాల్లో వారు చేసిన వ్యాఖ్యలు ప్రత్యర్థి పార్టీల్లోని వ్యక్తులను, కొన్ని వర్గాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని, అది అల్లర్లకు, ఘర్షణలకు దారితీసేలా ఉందని నోటీసులో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, పెనమలూరులో సున్నిత వాతావరణం ఉన్నందున శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగే అవకాశం ఉందని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని, ఉద్రిక్తతలు రెచ్చగొట్టవద్దని పేర్కొన్నారు.

ఓటమి భయంతోనే వైసీపీ దాడులు: నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట: ఎన్నికల్లో ఓడిపోతున్నామనే భయంతోనే వైసీపీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు, నేతలపై దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్నాయని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఆరోపించారు. శుక్రవారం జగ్గయ్యపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సరళి చూశాక వైసీపీ నేతలకు ఓడిపోతున్నామని అర్థమైందన్నారు. సీఎం జగన్ పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారన్నారు. వచ్చే నెల 4న ఎన్నికల ఫలితాలు మొత్తం ప్రపంచం దృష్టిని రాష్ట్రం వైపు చూసేలా చేస్తాయని జగన్ అంటున్నారని, కానీ కూటమికి భారీ విజయం చేకూరడంతో ప్రపంచమంతా రాష్ట్రం వైపు చూస్తుందని నెట్టెం కౌంటర్ ఇచ్చారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40

నిలకడగా కొనకళ్ల నారాయణ ఆరోగ్యం

మచిలీపట్నం టౌన్, మే 17 : మాజీ ఎంపీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు ఆరోగ్యం నిలకడగా ఉందని, నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందనవసరం లేదని నారాయణరావు సోదరుడు కొనకళ్ల బుల్లయ్య తెలిపారు. రెండు స్టంట్లు వేశారని, తన సోదరుడు నారాయణరావు మామూలుగానే అందరితో మాట్లాడుతున్నారని, ఆహార పానీయాలు స్వీకరిస్తున్నారన్నారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు రమేష్ ఆసుపత్రికి వస్తుండం వల్ల ఆసుపత్రి యాజమాన్యానికి, నారాయణరావుకు అసౌకర్యంగా ఉందన్నారు. పరిస్థితిని అర్థం చేసుకుని కార్యకర్తలు మచిలీపట్నం వచ్చినప్పుడు పరామర్శించవచ్చని బుల్లయ్య తెలిపారు.

చెరువుల్లా రోడ్లు!

- నీరుపోయే మార్గంలేక కొద్దిపాటి వర్షానికే మునిగిపోతున్న అండర్‌పాస్‌లు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని హైవే నిర్వాహకులు
- అధ్వానంగా పునాదిపాడు - కంకిపాడు ప్రధాన రహదారి



ఉయ్యూరు- కాటూరు రోడ్డులో అండర్‌పాస్ సమీపాన సర్వీసు రోడ్డులో నిలిచిన వర్షం నీరు

ఉయ్యూరు, మే 17 : విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి ఉయ్యూరు మండల పరిధిలోని సర్వీసు రోడ్లపై వర్షపునీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. కాటూరు రోడ్డు అండర్‌పాస్ వద్ద ఇరువైపులా, గండిగుంట, ఆకునూరు, మంటాడ, తాడంకి వద్ద అండర్‌పాస్‌లకు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లలో వర్షపు నీరు పోయే మార్గంలేక నిలిచిపోతుంది. దీంతో సర్వీసు రోడ్లపై వేళ్లేవారు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. హైవే నిర్వాహకులు మాత్రం పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారి విస్తరణలో అండర్ పాస్‌లు, సర్వీసురోడ్లు నిర్మించేప్పుడు సరైన చర్యలు చేపట్టకపోవడం వల్ల నీరు నిలిచి ప్రమాదకరంగా ఉంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నీట మునిగిన పునాదిపాడు - కంకిపాడు ప్రధాన రహదారి

నీట మునిగిన ప్రధాన రహదారులు

కంకిపాడు : మండలంలో శుక్రవారం తెల్లవారు జామున కురిసిన భారీ భారీవర్షానికి పలు ప్రధాన రహదారులు నీటమునిగాయి. కంకిపాడు సెంటర్‌తో పాటు పునాదిపాడు - కంకిపాడు ప్రధాన రహదారిపై నీరు చేరి గుంతలు కనిపించకుండా పోయాయి. వాహనదారులు వర్షపు నీటిలో పడి స్వల్పగాయాలతో బయటపడ్డారు. చిన్నపాటి వర్షం పడితేనే రోడ్లపై నిరునిలచి, ప్రమాదకరంగా మారుతున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా అంటూ స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మహిళపై దాడి : కేసు నమోదు

పెనమలూరు, మే 17 : పెనమలూరులో అపార్టుమెంటు కొనుక్కొని అక్కడ పనులు చేసుకొంటుండగా ల్యాండు ఓనరు, మరికొంత మంది తనపై దాడి చేసి కొట్టారంటూ ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనుమోలు లక్ష్మీకుమారి, తన భర్త వెంకటేశ్వరరావు పోరంకిలో కాపురం ఉంటారు. వీరు పెనమలూరులో అపార్టుమెంటు కొనుక్కొని అక్కడ పనులు చేసుకొంటుండగా స్థలం ఓనరు తాతినేని హేమ, ఆమెకు సంబంధించిన పని మనుషులు ముగ్గురు లక్ష్మీకుమారిపై దాడిచేసి కొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసంపై..

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో పన్నెండు లక్షలను సైబర్ నేరగాళ్లు మోసం చేశారంటూ వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోరంకి ప్రభునగర్‌లో నివాసముండే ఉపద్రష్ట రామకృష్ణమూర్తి ఎస్బీఐలో పనిచేసి పదవీ విరమణ పొందాడు. రెండు నెలల క్రితం ఇతనిని సైబర్ నేరగాళ్లు డీ1స్టడీ అనే గ్రూపులో చేర్చి షేర్లపై అవగాహన కల్పించారు. తర్వాత ఫ్లిస్ అనే ఇంటర్నేషనల్ యాప్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తే మంచి లాభాలుంటాయని నమ్మబలికి అతని వద్ద నుంచి విడతల వారీగా దాదాపు పన్నెండు లక్షలను పెట్టుబడి పెట్టించారు. అతని సొమ్ము, లాభం కలిసి మొత్తం 22లక్షలుగా చూపించారు. దీంతో బాధితుడు ఈనెల 13న ఒక సారి పదిలక్షలు, మరో విడతలో 12లక్షలను విత్‌డ్రావల్ పెట్టాడు. అటునుంచి సదరు సైబర్ నేరగాళ్లు ఇతని సొమ్మును ఇతని ఖాతా నుంచి వేరే ఖాతాలకు మళ్లించి విత్‌డ్రా చేయకుండా చేశారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు గురువారం పెనమలూరు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పంచ పట్టాభిరామస్వామికి మండలాభిషేకం నేడు

ఉయ్యూరు, మే 17 : ఉయ్యూరు వేణుగోపాలస్వామి, పంచపట్టాభిరామస్వామి దేవస్థానంలో శనివారం లోక కళ్యాణార్థం మండలాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్టు దేవస్థాన పాలక మండలి సభ్యులు తెలిపారు. మహోత్సవంలో భాగంగా ఉదయం 8 గంటల నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్నిప్రతిష్ఠ, వాస్తుహోమం, పంచసూక్త, నవగ్రహ, మూలమంత్ర, మహాశాంతి హోమం, పంచ పట్టాభిరామస్వామి, వేణుగోపాలస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారికి, పరివార దేవతలకు మండలాభిషేకం నేత్రపర్వంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు

ఉయ్యూరు, మే 17 : బాలికకు మాయమాటలు చెప్పి ప్రేమిస్తున్నానని ప్రలోభ పెట్టి బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా, ఎస్సై గణేశ్‌కుమార్ తెలిపారు. ఉయ్యూరుకు చెందిన బాలికను ప్రేమిస్తున్నట్టు నమ్మబలికి కిడ్నాప్ చేసినట్టు ఆమె తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు అతనిని అరెస్టు చేశామని, శుక్రవారం కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేటు 15 రోజులు రిమాండ్ విధించినట్టు తెలిపారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

గన్నవరం, మే 17 : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కొత్తపేట, చెంచుల కాలనీ, దుర్గాపురం, ఎయిర్‌పోర్టు ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు 11కెవి టౌన్ ఫీడర్‌ను నిలుపుదల చేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

హనుమాన్‌జంక్షన్ : విద్యుత్ లైన్ల మరమత్తుల నేపథ్యంలో బొమ్ములూరు, ఆరుగొలను సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 6నుంచి 9గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హనుమాన్‌జంక్షన్ సెక్షన్ ఏఈ ఏ.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వివాహిత కనపడడం లేదని ఫిర్యాదు

తోట్లవల్లూరు, మే 17 : గరికపర్రులో నవ వధువు ఈడే నాగిణి(24) కనపడడం లేదని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్సై పి విశ్వనాథ్ తెలిపిన వివరాల మేరకు ఏలూరుజిల్లా పెదవేగికి చెందిన నాగిణి రెండు నెలల క్రితం గరికపర్రుకు చెందిన ఈడే శ్రీనివాసరావును వివాహం చేసుకుంది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన నాగిణి ఎంతకీ రాకపోవడంతో భర్త ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కరెంటు స్తంభాల్లో ఇనుము చోరీ యత్నం, నిందితుడి పట్టివేత

తోట్లవల్లూరు : సిమెంటు కరెంటు స్తంభాలను పగులకొటి అందులో వచ్చే ఇనుము తీగలను ఎత్తుకెళ్లేందుకు యత్నించిన ఓ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు విద్యుత్ ఏఈ దేవదాసు తెలిపారు. ముగ్గురు వ్యక్తులు స్తంభాల్లో ఇనుము చోరీకి పాల్పడుతుండగా గుర్తించామని, ఇద్దరు పారిపోగా ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పటించామన్నారు. నిందితుడు చిన ఓగిరాలకు చెందిన వ్యక్తిగా చెప్పాడన్నారు.

హింసకు పాల్పడితే నగర బహిష్కరణ

సీఐ టీవీవీ రామారావు

పెనమలూరు, మే 17 : రాజకీయ పార్టీల ముసుగులో హింసకు పాల్పడే వారిపై నగర బహిష్కరణ అమలు చేస్తామని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో చెలరేగిన హింసాత్మక సంఘటన నేపథ్యంలో అటువంటి చర్యలకు పాల్పడవద్దని, అలాంటి వారిపై తీవ్రమైన చర్యలు తీసుకుంటామని, కొంత మంది సంఘ విద్రోహ శక్తులు ఉద్దేశపూర్వకంగా తమ వెంట ఉండే అమాయక యువతను, కార్యకర్తలను రెచ్చగొట్టి వాళ్ల హింసకు పాల్పడేలా చేస్తున్నారని, దానివల్ల అనవసరంగా వారు కేసుల్లో ఇరుక్కొని జీవితాలను పాడు చేసుకొంటున్నారని, స్థానిక రాజకీయ నాయకులు తమ కేడరు పట్ల బాధ్యతగా ఆలోచించాలని, తమ తాత్కాలిక ప్రయోజనాల కోసం వారి జీవితాలు బలి పెట్టవద్దని ఆ ప్రకటనలో కోరారు. ఎన్నికల కేసులో ఒక్కసారి ఇరుక్కుంటే జీవితాంతం బాధపడవలసి వస్తుందని యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అందరూ సంయమనం పాటించాలని, పోలీసు స్టేషను పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా ఉంచామని, పికెట్లు ఏర్పాటు చేశామని సమస్యలు సృష్టించాలని ప్రయత్నిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పెదపులిపాకలో పర్యటన..

పెదపులిపాకలో శుక్రవారం సీఐ రామారావు పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే జైలుకు పంపిస్తామని, ప్రజలు సంయమనంతో ముందుకు వెళ్లాలని కోరారు. లేని పక్షంలో నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఉద్రేకంలో దారి తప్పి వ్యవహరించే యువతను వారించే బాధ్యతను పెద్దలు తీసుకోవాలని, ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

క్రీడా ప్రాంగణం అభివృద్ధికి చర్యలు



క్రీడా ప్రాంగణ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కేవీఆర్ కిషోర్

గన్నవరం, మే 17: క్రీడాప్రాంగణాన్ని ప్రాధాన్యత క్రమంలో మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ అన్నారు. శుక్రవారం క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ, క్రీడా ప్రాంగణం అభివృద్ధి చేయటమే కాకుండా సేవా కార్యక్రమాలు కూడా విస్తృతంగా చేస్తున్నట్లు తెలిపారు. ఎండలు మండిపోతున్న దృష్ట్యా వాకింగ్‌కు వచ్చే వారికి ఉదయం సాయంత్రం మజ్జిగ, రాగిజావ , పండ్లు దాతల సహకారంతో అందజేస్తున్నట్లు చెప్పారు. వాకర్స్‌తో పాటు క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా క్రీడామైదా నాన్ని అభివృద్ధి చేసామన్నారు. ప్రతి ఒక్కరిలో ఆరోగ్యాన్ని పరిరక్షించేలా క్రీడలను ప్రోత్సహించటం జరుగుతుందని, వాకర్స్ అసోసియేషన్ సహకారంతో క్రీడామైదానాన్ని శరవేగంగా అభివృద్ధి చేసి అందరికి అందుబాటులో ఉండే విధంగా చేస్తామని తెలిపారు.

భూసార పరిరక్షణకు మట్టి పరీక్షలు



మట్టిపరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

ఘంటసాల : నేలల ఆరోగ్యానికి రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు తెలిపారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భా గంగా శుక్రవారం ఘంటసాల శివారులోని రైతుల పొలాలను సందర్శించి రైతులకు భూసార పరీక్ష ఆవశ్యకతపై అవగాహన కలిగించారు. భూసార పరీక్షల వల్ల అధిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి అవసరమైనంత మో తాదులో మాత్రమే అందించటం వల్ల నేల ఆరోగ్యంతో పాటు రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందన్నారు.

పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో కిరణ్ కుమార్

ప్రొద్దుటూరు (కంకిపాడు), మే 17 : రసాయన ఎరువుల వినియోగంతో నేల సారం తగ్గిపోతుందని కంకిపాడు మండల వ్యవసాయ శాఖ అధికారి వి.ఎం. కిరణ్‌కుమార్ అన్నారు. ప్రొద్దుటూరులో శుక్రవారం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, రసాయన ఎరువులతో నేలసారం కోల్పోతుందన్నారు. దిగుబడి తగ్గిపోతుందని, పచ్చిరొట్ట విత్తనాల ద్వారా సాగు చేసి పూత దశలో దున్నడం ద్వారా చేనుకు అవసరమైన సేంద్రీయ పదార్థంతో పాటు పోషకాలు లభిస్తాయని, తద్వారా నేల సారవంతం అవుతుందని తెలియజేశారు. అదే విధంగా పిల్లి పెసర విత్తనాలను అందుబాటులో ఉన్నాయని 10 కేజీల జీలుగ బస్తా పూర్తి ధర రూ. 880 కాగా 50 శాతం సిబ్సిడీ రూ. 440కు రైతులకు అందచేయడం జరుగుతుందని తెలియజేశారు. పిల్లి పెసర 8 కేజీల బస్తా రూ. 1072 కాగా సబ్సిడీపై రూ. 536కు అందచేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. వీఏఏ విజయ్, రైతులు పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

మచిలీపట్నం టౌన్ : పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం గ్రామానికి చెందిన ఇద్దరు బైక్ దొంగలను అరెస్టు చేసినట్లు గూడూరు ఎస్సై ఐ. వీర్రాజు తెలిపారు. వీరవాసరంలో బైక్ దొంగతనం చేసినట్లు ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. బైక్ చోరీ నిందితులను గుర్తించి వీరవాసరం పోలీసు స్టేషన్‌కు బైక్‌లతో సహా పంపుతున్నామన్నారు. గూడూరు వచ్చిన బాలసాయి, అద్దాల సాయికిషోర్‌లను స్థానిక యువకులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు అప్పగించారన్నారు. యువతను ఆయన అభినందించారు.

అభివృద్ధికి దూరంగా

కొత్తగూడెం ఊర చెరువు

కోతకు గురవుతున్న రోడ్డు

గన్నవరం, మే 17: మండల పరిధిలోని కొత్తగూడెం ఊరచెరువు అభివృద్ధికి దూరంగా ఉంది. చెరువు కట్ట కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ చెరువు మీదుగా చిక్క వరం, కొత్తగూడెం, చింతగుంట, కండ్రిక వాసులతో పాటు పలు వాహనాలు వీరపనేని గూడెం వైపు రాకపోకలు సాగిస్తుంటారు. చెరువు తారురోడ్డు వైపు కోతకు గురై రోడ్డు సగానికి వచ్చింది. గత 20 ఏళ్లగా ఈ చెరువు దుస్థితి ఇలాగే ఉంది. చెరువు చుట్టూ కంప పెరిగి అధ్వానంగా ఉంది. నీళ్లు పచ్చగా మారి వాసన వస్తున్నాయి. గ్రామంలో పశువులకు నీటి ఆధారంగా ఉన్న ఈ చెరువు అభివృద్ధికి నోచుకోవటం లేదని గ్రామస్తులు చెబుతు న్నారు. ఎంతమంది అధికారులు, ప్రజా ప్రతినిధులు మారిన దీని అభివృద్ధికి దృష్టి సారించటం లేదని చెబుతున్నారు. రోజురోజుకి చెరువు కట్ట కోతకు గురౌతుంది. దీంతో రాకపోకలు సాగించే వారు భయాందోళన చెందుతున్నారు. ఎక్కువగా స్కూల్ వ్యాన్‌లు ఇటుగానే వస్తున్నాయి. డ్రైవర్ అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చెరువు చుట్టు రివిట్‌మెంట్ చేసి అభివృద్ధి పరచాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా రోడ్డు



వీరవల్లిలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ

అధిక రక్తపోటును నియంత్రించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 17 : మారిన జీవనశైలి కారణంగా ఎక్కువ మంది ప్రజలు అధిక రక్తపోటు బారిన పడుతున్నారని, తీవ్రతను అర్థం చేసుకుని అదుపులో ఉంచుకోవడమే నివారణకు మార్గమని వైద్యాధికారి వై. కిరణ్మయి సూచించారు. వీరవల్లి పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం ప్రపంచ హైపర్‌టెన్షన్ డే (ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం) సందర్భంగా ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శరీరంలో బీపీ ఎక్కువగా ఉన్నా లక్షణాలు కనిపించవన్నారు. మెదడు, గుండె లాంటి కీలకభాగాలపై తీవ్రప్రభావం చూపుతుంది కనుకే దీనిని సైలెంట్ కిల్లర్‌గా అభివర్ణిస్తామన్నారు. అధిక రక్తపోటు వల్ల పక్షవాతం, కంటిచూపు కోల్పో వడం లాంటి ప్రాణాంతక సమస్యలు ఉత్పన్నమవుతాయని అందుకే హైపర్ టెన్షన్ రాకుండా చూసుకోవాలని, వచ్చినా అదుపులో ఉంచుకోవాలని ప్రజలకు సూచిం చారు. ఆహారంలో పొటాషియం ప్రధానంగా ఉండే పండ్లు, కూరగాయలతో పాటు శారీరక శ్రమతో కూడిన వ్యాయామం చేయడం వల్ల హైపర్ టెన్షన్ నిరోధించ వచ్చన్నారు. రక్తపోటును ఖచ్చితంగా కొలవాలని తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేయిం చారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ సౌదామణి, ఎంపీహెచ్ఓ మూర్తి, ప్రదీప్‌సన్, పండు, యూడీసీ సురేంద్ర, మంగతాయారు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు సంక్షేమ చట్టం చేయాలి

గుడివాడ : అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ చట్టం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య డిమాండ్ చేశారు. ఏలూరురోడ్డులోని సీపీఐ కార్యాలయంలో గుడివాడ నియోజకవర్గ సీపీఐ కమిటీ సమావేశాన్ని కామ్రేడ్ డి.నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ, అసంఘటితరంగ కార్మికులు చాలీచాలనీ వేతనాలతో జీవనం సాగిస్తున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూలై 27, 28 తేదీల్లో ఏఐటీయూసీ జిల్లా మహాసభలు గుడివాడలో నిర్వహించడం జరుగుతుందన్నారు. తొలుత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు విజయకుమార్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. గూడపాటి ప్రకాష్‌బాబు, సీహెచ్ సత్యనారాయణ, కె.సురేష్, డి.రామకృష్ణ, ఆర్.గౌరీనాయుడు, ఎం.పద్మారావు, వి.శ్యామ్సన్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40

నిలకడగా కొనకళ్ల నారాయణరావు ఆరోగ్యం

మచిలీపట్నం టౌన్, మే 17 : మాజీ ఎంపీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు ఆరోగ్యం నిలకడగా ఉందని, నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందనవసరం లేదని నారాయణరావు సోదరుడు కొనకళ్ల బుల్లయ్య తెలిపారు. రెండు స్టంట్లు వేశారని, తన సోదరుడు నారాయణరావు మామూలుగానే అందరితో మాట్లాడుతున్నారని, ఆహార పానీయాలు స్వీకరిస్తున్నారన్నారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు రమేష్ ఆసుపత్రికి వస్తుండం వల్ల ఆసుపత్రి యాజమాన్యానికి, నారాయణరావుకు అసౌకర్యంగా ఉందన్నారు. పరిస్థితిని అర్థం చేసుకుని కార్యకర్తలు మచిలీపట్నం వచ్చినప్పుడు నారాయణరావును పరామర్శించవచ్చని బుల్లయ్య తెలిపారు.



ఆలయానికి మకర తోరణాన్ని అందజేస్తున్న దాతలు

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

నాగాయలంక : వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో 331వ ఆరాధనా మహోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. వీరబ్రహ్మేంద్రస్వామి ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గణపతి హోమం, శాంతి హోమం, విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి భవిరి శంకర్‌నాథ్, మల్లేశ్వరి దంపతులు మకరతోరణాన్ని బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన మద్ది నాగ వెంకట సాయికుమార్ - రాజ్యలక్ష్మి దంపతులు వెండి ధారా పాత్ర అందజేశారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రచార పరిషత్ తరపున అధ్యక్షుడు భవిరి రవి స్వామి వారి విగ్రహాన్ని ఆలయానికి సమర్పించారు. నాలుగు వేల మందికి అన్న ప్రసాదం వితరణ చేశారు. ఆలయ ఛైర్మన్ భవిరి సుధాకర్, ప్రధాన అర్చకులు మహేశ్వరపు శ్రీనివాస్ గాంధీ పర్యవేక్షించారు.



దాచూరి రామిరెడ్డికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

యూటీఎఫ్ నేత రామిరెడ్డికి నివాళి

అవనిగడ్డ : అవనిగడ్డలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఉపాధ్యాయ ఉద్యమ నేత , మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కనకారావు మాట్లాడుతూ రామిరెడ్డి ఐక్య ఉద్యమాలు నిర్మించటంలోనూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అవిరళ కృషి చేశారన్నారు. మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జీవేంద్రరావు, బి.శివరామకృష్ణ, సహాధ్యక్షులు సింహాద్రి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు పి.వి.ఆంజనేయులు, మోపిదేవి మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎస్.స్వామి, బండెల గోవర్ధనరావు, వివివి.గోవిందరావు, బడే దాశరధి, యాసం శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మెరకనపల్లి యువతకు క్రికెట్ కిట్ అందిస్తున్న ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తా : ఎన్ఆర్ఐ బొబ్బా

అవనిగడ్డ : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తానని ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మెరకనపల్లి గ్రా మ యువతకు క్రికెట్ కిట్, ఇతర క్రీడా పరికరాలను అందజేశారు. టీడీపీ నేతలు బండే రాఘవ, మెరకనపల్లి యువత, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భూసార పరిరక్షణకు మట్టి పరీక్షలు అవశ్యం

ఘంటసాల : నేలల ఆరోగ్యానికి రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు తెలిపారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఘంటసాల శివారులోని రైతుల పొలాలను సందర్శించి రైతులకు భూసార పరీక్ష ఆవశ్యకతపై అవగాహన కలిగించారు. భూసార పరీక్షల వల్ల అధిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి అవసరమైనంత మోతాదులో మాత్రమే అందించటం వల్ల నేల ఆరోగ్యంతోపాటు రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు కె.షైనీ, ఏ.సుదర్శిని, రైతులు పాల్గొన్నారు.




మట్టిపరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు షైనీ, సుదర్శిని



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి తాతయ్య

అసంఘటిత కార్మికులకు సంక్షేమ చట్టం చేయాలి

గుడివాడ : అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ చట్టం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య డిమాండ్ చేశారు. ఏలూరురోడ్డులోని సీపీఐ కార్యాలయంలో గుడివాడ నియోజకవర్గ సీపీఐ కమిటీ సమావేశాన్ని కామ్రేడ్ డి.నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చే టి.తాతయ్య మాట్లాడుతూ అసంఘటితరంగ కార్మికులు చాలీ చాలనీ వేతనాలతో జీవనం సాగిస్తున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూలై 27, 28 తేదీల్లో ఏఐటీయూసీ జిల్లా మహాసభలు గుడివాడలో నిర్వహించడం జరుగుతుందన్నారు. తొలుత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేరు గు విజయకుమార్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు, సహాయ కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ, కమిటీ సభ్యులు కె.సురేష్, డి.రామకృష్ణ, ఆర్.గౌరీనాయుడు, ఎం.పద్మారావు, వి.శ్యామ్సన్‌తదితరులు పాల్గొన్నారు.



సుమతీ శతకం పోటీల విజేతలకు బహుమతులు

అవనిగడ్డ : త్యాగరాజ స్వామి 257వ జయంతి సందర్భంగా కీర్తిశేషులు పాలపర్తి సుబ్బారావు జ్ఞాపకార్థం అవనిగడ్డ త్యాగరాజ మందిరంలో వేమన, సుమతీ శతక పద్యాల పోటీలు జరిగాయి. మానేపల్లి సరస్వతీ, చిరంజీవి, బి.సుహిత భారతి, నంబూరి నిర్మలాదేవి ప్రతిభ చూపి బహుమతులు అందజేశారు. మంగళంపల్లి బాలమురళీకృష్ణ శిష్యుడు, సంకీర్తన కౌముది కస్తూరి గోపాలరావు గాత్ర కచేరి అలరించింది. వయోలిన్ చావలి శ్రీనివాసరావు, మృదంగం చావలి కృష్ణమోహన్‌పై సహకరించారు. తెలుగుసావిడి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ అందరినీ సత్కరించారు. పాటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.



నీటమునిగిన బందరు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు



చెరువును తలపిస్తున్న తాడేపల్లి ప్రధాన రహదారి



కూచిపూడి రహదారిలో మురుగు నీటిని మళ్లిస్తున్న గ్రామస్థులు

అకాల వర్షం.. రోడ్లలో నరకం

(మచిలీపట్నం టౌన్)

మచిలీపట్నంలో శుక్రవారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. మేజర్‌డ్రెయిన్లకు మైనర్ డ్రెయిన్లు అనుసంధానం కాకపోవడంతో మురుగు పొంగిపొర్లుతోంది. కోనేరుసెంటర్, రేవతీ సెంటర్ ముంపునకు గురయ్యాయి. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు నీటమునిగింది. ప్రజలు తీవ్రమైన అవస్థలకు గురవుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంతో పాటు జిల్లా సబ్ జైలు, సబ్ ట్రెజరీ, తాలూకా పోలీసు కార్యాలయాలకు వెళ్లే మార్గంలో మురుగునీరు పోయేందుకు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం

మచిలీపట్నంలో అంతర్గత రోడ్లు ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా కొన్ని రోడ్ల దుస్థితి మారలేదు. ప్రభుత్వాలు మారినా, నగరపాలక సంస్థ పాలకులు మారినా నగర ప్రజల అవస్థలు తీరడంలేదు. లక్ష్మణరావుపురంలో డ్రెయిన్లు తవ్విన అనంతరం రోడ్లు సరిచేయలేదు. అధ్వాన రోడ్లతో ప్రజలకు నరకం కనిపిస్తోంది. నగరంలోని మైనర్ డ్రెయిన్లను ప్రధాన డ్రెయిన్లతో అనుసంధానం చేయకపోవడంతో మురుగు రోడ్డుపై పారుతోంది. దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మునిసిపల్ కమిషనర్ బదిలీ అయ్యారు. మునిసిపల్ ఇంజనీర్లు బదిలీ అయ్యారు. మేయర్ మారారు. అధికారులు, పాలకులు మారుతున్నా నగరంలోని అంతర్గత రోడ్ల పరిస్థితి మారడం లేదు.

చెప్పి చెప్పీ విసిగి పోయాం



రోడ్లు, డ్రెయిన్ల సమస్యలపై అధికారులకు చెప్పీ చెప్పీ విసిగి పోయాం. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి. మురుగుపోయేందుకు చర్యలు చేపట్టాలి. మైనర్ డ్రెయిన్లను మేజర్ డ్రెయిన్లతో అనుసంధానం చేయాలి. కొత్తగా ఏర్పడే ప్రభుత్వమైనా సమస్యలను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నాం.

\- వెంట్రప్రగడ భార్గవ్, మచిలీపట్నం

చెరువును తలపిస్తున్న తాడేపల్లి రోడ్డు

ఘంటసాల : ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలో ప్రధా న రహదారి గోతులు పడి అధ్వానంగా మారింది. రహదారి భారీ గోతుల్లో వర్షపు నీరు నిలిచి ఉండ టంతో చెరువును తలపిస్తోంది. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వైసీపీ ప్రభుత్వం కనీసం రహదారికి మరమ్మతులు చేపట్టకపోవటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రహదారి పూర్తిగా గోతులమయంగా మారి ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తుంది. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా రహదారికి మోక్షం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కూచిపూడి - చల్లపల్లి రోడ్డు అధ్వానం

కూచిపూడి : ప్రధాన రహదారులన్నీ గోతులతో అధ్వానంగా ఉండడంతో వర్షపు నీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రజలే స్వచ్ఛందంగా వర్షపు నీటిని డ్రెయిన్లలోకి మళ్లించాల్సిన పరిస్థితులున్నాయి. అధికారులకు చీమకుట్టినట్లైనా లేకపోవటం గమనార్హం. కూచిపూడి - చల్లపల్లి ఆర్ అండ్ బి రహదారిలో మిల్లు సమీపంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ గొయ్యిని అధికారులు పూడ్చలేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరటంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రజలసే స్పందించి రహదారుల గోతుల్లోని నీటిని మళ్లిస్తున్నారు. కూచిపూడి బస్టాండ్ ప్రాంతం, బార్లపూడి రహదారి, పెదపూడి, మొవ్వ ప్రధాన రహదారుల్లో ఏర్పడిన పెద్ద పెద్ద గుంటలు వర్షపు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి.

రెండోరోజు ఎంసెట్ ప్రశాంతం

మచిలీపట్నం టౌన్, మే 17 : మచిలీపట్నం ఇంజనీరింగ్ కళాశాలలో రెండోరోజు శుక్రవారం ఎంసెట్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 86 మంది, మధ్యాహ్నం 82 మంది హాజరైనట్టు ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. **పెడన రూరల్ :** నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసెట్ రెండోరోజు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ బి.ఆర్.ఎస్ రెడ్డి తెలిపారు. రెండో రోజు 180 మంది విద్యార్థులకు 164 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి

అధిక రక్తపోటుతో అనర్థాలు

మచిలీపట్నం టౌన్, మే 17 : అధికరక్తపోటుతో అనేక అనర్థాలు కలుగుతాయని, మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం, చెడు అలవాట్లకు దూరంగా ఉండి వైద్యుల సూచనలు పాటిస్తూ రక్తపోటును నియంత్రించుకోవచ్చని, ఎక్కువ కాలం జీవించవచ్చని డీఎంహెచ్‌వో జి.గీతాబాయి అన్నారు. ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆశ వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆ మె అధిక రక్తపోటు నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. రక్తపోటుతో గుండె ఆరోగ్యం, స్ట్రోక్, మూత్రపిండాల వైఫల్యం వంటి అనర్థాలు చేకూరుతాయన్నారు. 140/90 కంటే ఎక్కువ రక్తపోటు ఉంటే వైద్యుడిని సంప్రదించాలన్నారు. ఆల్కాహాల్, పొగాకుకు దూరంగా ఉండాలన్నారు. బరువు ఎక్కువగా ఉంటే తగ్గించుకోవాలని, వ్యాయామం చేయాలని, కూరగాయలు, పండ్లు తీసుకోవాలన్నారు. హిమబిందు, మహేష్, సురేష్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

మచిలీపట్నం టౌన్ : వర్షం కారణంగా ఇబ్బందులు పడుతున్న కాలేఖాన్‌పేట ఎస్సీ కాలనీ వాసులకు శుక్రవారం లంకిశెట్టి ఫెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో పెన్నేరు లతా చంద్రనరసింహారావు, 15వ వార్డు మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ, లంకిశెట్టి నాగసాయి, న్యాయవాది జొన్నలగడ్డ వెంకట నాగరాజు, మాదిరెడ్డి బాబా తదితరులు పాల్గొన్నారు. లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, మన పరిసరాల్లో ఉన్న పేదలను ఆదుకునేందుకు దాతలు , మానవతా వాదులు ముందుకు రావాలన్నారు.

ఠాగూర్ గ్రంథాలయానికి సీసీ కెమెరాలకు నగదు వితరణ

గుడివాడ : పుట్టి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం కుమార్తె పుట్టి నాగలక్ష్మి విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయానికి సీసీ కెమెరాలకు నగదు అందజేశారు. డాక్టర్ జి.వి పూర్ణచంద్రరావు, గుత్తికొండ సుబ్బారావు, బాల త్రిపుర సుందరి, సత్య నారాయణ, గ్రంధాలయాధికారి రమాదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి వాసవీ జయంతి ఉత్సవాలు

పెడన : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు అమ్మవారి శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు కొల్లూరి చిన్నా తెలిపారు. అభిషేకాలు, పిండి జ్యోతుల ఊరేగింపు, సహస్ర దీపార్చన, లక్ష కుంకుమార్చన, విశిష్ట మల్లెల పుష్పార్చన నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల ముగింపురోజైన సోమవారం రాత్రి వాసవీ మాతను పురవీధులలో ఊరేగిస్తామన్నారు. మంగళవారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో వేణుగోపాలస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాత్రి స్వామి వారిని పెండ్లి కుమారుడిని చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈనెల 25 వరకు జరిగే వేడుకల్లో 22న స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందని అధికారులు తెలిపారు.

రక్తదానం

గుడివాడ : అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడి మానవత్వాన్ని చాటాలని సామాజిక వేత్త మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) కోరారు. శుక్రవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గంటా సుబ్రహ్మణ్యానికి శస్త్రచికిత్స నిమిత్తం అవసరమైన రక్తాన్ని ఆర్.కె వారియర్స్ సభ్యులు కిరణ్ దానం చేశారు. ఈ సందర్భంగా కిరణ్‌ను ఆర్.కె, చరణ్, శివ, శ్యామ్ తదితరులు అభినందించారు.

మట్టా రాధాకృష్ణమూర్తి విశ్వదాత అవార్డుకు ఎంపిక

పెడన : ప్రముఖ సంఘ సేవకుడు, విశ్రాంత జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మట్టా రాధాకృష్ణమూర్తి విశ్వదాత-2024 అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 20న ఎలకుర్రులో ఈ అవార్డును అందుకుంటారు. రాధాకృష్ణమూర్తి అనేక సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రముఖ పాత్ర పోషించారు.

అష్టలక్ష్మీదేవికి విశేష పూజలు

గుడివాడ రూరల్ : మండల పరిధిలోని చిన ఎరుకపాడు గ్రామంలో వేంచేసి ఉన్న అష్టలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వివాహిత కనపడడం లేదని ఫిర్యాదు

తోట్లవల్లూరు, మే 17 : గరికపర్రులో నవ వధువు ఈడే నాగిణి(24) కనపడడం లేదని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్సై పి విశ్వనాథ్ తెలిపిన వివరాల మేరకు ఏలూరుజిల్లా పెదవేగికి చెందిన నాగిణి రెండు నెలల క్రితం గరికపర్రుకు చెందిన ఈడే శ్రీనివాసరావును వివాహం చేసుకుంది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన నాగిణి ఎంతకీ రాకపోవడంతో భర్త ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కృష్ణానదిలో గుర్తు తెలియని శవం



కోడూరు : ఉల్లిపాలెం గ్రామ సమీపాన కృష్ణానదిలో గుర్తు తెలియని పురుషుని మృతదేహం ఉన్నట్లు ఎస్సై పి.శిరీష తెలిపారు. ఉల్లిపాలెం పడవల రేవు సమీపంలో 40-45 సంవత్సరాల పురుషుడి భౌతికకాయం కుళ్లిపోయి ఉందన్నారు. పోస్టుమార్టం చేయిం చి మృతదేహాన్ని ఖననం చేసినట్లు తెలిపారు.

కరెంటు స్తంభాల్లో ఇనుము చోరీ యత్నం, నిందితుడి పట్టివేత

తోట్లవల్లూరు : సిమెంటు కరెంటు స్తంభాలను పగులకొటి అందులో వచ్చే ఇనుము తీగలను ఎత్తుకెళ్లేందుకు యత్నించిన ఓ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు విద్యుత్ ఏఈ దేవదాసు తెలిపారు. ముగ్గురు వ్యక్తులు స్తంభాల్లో ఇనుము చోరీకి పాల్పడుతుండగా గుర్తించామని, ఇద్దరు పారిపోగా ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పటించామన్నారు. నిందితుడు చిన ఓగిరాలకు చెందిన వ్యక్తిగా చెప్పాడన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

మచిలీపట్నం టౌన్ : పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం గ్రామానికి చెందిన ఇద్దరు బైక్ దొంగలను అరెస్టు చేసినట్లు గూడూరు ఎస్సై ఐ. వీర్రాజు తెలిపారు. వీరవాసరంలో బైక్ దొంగతనం చేసినట్లు ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. బైక్ చోరీ నిందితులను గుర్తించి వీరవాసరం పోలీసు స్టేషన్‌కు బైక్‌లతో సహా పంపుతున్నామన్నారు. గూడూరు వచ్చిన బాలసాయి, అద్దాల సాయికిషోర్‌లను స్థానిక యువకులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు అప్పగించారన్నారు. యువతను ఆయన అభినందించారు.